సాక్షి
వరంగల్
బుధవారం । 21 । జూన్ । 2023



**ఆసనం..ఆరోగ్యం..**
ఉరుకులు, పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతను చేకూర్చే దివ్య ఔషధం యోగా. నేడు యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
- 8లో▸



**నకిలీ పత్తి విత్తన ముఠా అరెస్ట్**
నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/28^0$

**వాతావరణం**
జిల్లాలో బుధవారం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలు చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నర్సంపేట వాసికి అరుదైన గౌరవం

నర్సంపేట: నర్సంపేటకు చెందిన ఎన్నారై పిన్నా భాస్కర్‌కు అరుదైన అవకాశం లభించింది. అమెరికాలో వైట్‌హౌస్‌కు ఈనెల 22న ప్రధాని మోదీ రానున్న సందర్భంగా ప్రధానిని ఆహ్వానించే అరుదైన అవకాశం భాస్కర్‌కు దక్కింది. పిన్నా భాస్కర్ బీఆర్‌ఎస్ ఎన్నారై విభాగంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనకు ఈ అవకాశం దక్కడంపై భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

### టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 15మంది గైర్హాజర్

కాళోజీ సెంటర్: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించారు. ఇందులో 27 మంది విద్యార్థులకుగాను 12మంది హాజరు కాగా 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు.

### ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ సౌకర్యాలు



చెన్నారావుపేట: ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని డీఈఓ వాసంతి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మన ఊరు–మన బడి కార్యక్రమంలో ఆధునీకరించిన పాఠశాలలను ప్రారంభించారు. ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. డీఈఓ ఖాదర్‌పేటలో మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కొరకు ఉదయం రాగిజావ, మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ అందించడం జరుగుతుందన్నారు. ఉన్నత విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు ఉన్నారు.

### న్యూట్రిషన్ కిట్‌తో గర్భిణులకు ఆరోగ్యం



చెన్నారావుపేట: గర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి న్యూట్రిషన్ కిట్ ఉపయోగపడుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16 వారాల నుంచి 24 వారాల లోపు గర్భిణులకు ఈ కిట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సరోజ, సుమన్, అనూష్, సహజ, ప్రేమలత, సువార్త, స్వరూపరాణి, హేమలత ఉన్నారు.

### అమెరికాలో హిమాన్సీ నృత్య ప్రదర్శనలు

హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సీచౌదరి అమెరికాలో నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈనెల 24న కాలిఫోర్నియాలోని యువభారతి సాంస్కృతిక సంస్థ ఉత్సవాలు, జూలై ఒకటిన డల్లాస్‌లో నాటా, జూలై 8న ఫిలడెల్ఫియాలో తానా ఉత్సవాల్లో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించనున్నట్లు హిమాన్సీ తెలిపారు.

# ఇటు బ్లాక్.. అటు ఫేక్

**రైతుల నెత్తిన విత్తన పిడుగు**
- పత్తి గింజలతో పరేషాన్
- బ్లాక్ మార్కెట్లో కోరుకున్న సీడ్స్
- డిమాండ్ నేపథ్యంలో నకిలీ దందా



విత్తనషాపుల వద్ద రైతుల సందడి (ఫైల్)



నర్సంపేట: వానాకాలం పంటల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో బ్లాక్ మార్కెటింగ్.. నకిలీ విత్తనాలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. విత్తన, ఎరువుల వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలు.. మరోసారి వరుణుడి కరుణ కోరుకుంటూ సాగుబడికి సిద్ధమవుతుంటే మరో పక్క వ్యాపారులు రైతులను దోచుకునే పనిలో పడ్డారు. జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తిసాగుపై మక్కువ చూపుతారు. ఇదే అదనుగా వ్యాపారులు అక్రమంగా సంపాదించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పత్తి విత్తనాలను పెద్ద మొత్తంలో బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు తెలుస్తోంది. రైతులు కోరుకునే పత్తి గింజలను దాచిపెట్టి దోచుకునేందుకు పలువురు వ్యాపారులు కుమ్మక్కైనట్లు చర్చ జరుగుతుంది. సాధారణంగా ఎకరాకు మూడు విత్తనాల ప్యాకెట్లు(ఒక్కో ప్యాకెట్ 450 గ్రాములు) అవసరం పడతాయి. జిల్లాలో గత ఏడాది లక్షా 28వేల 500ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా ఈ ఏడాది 10వేల ఎకరాలు అదనంగా సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు ఆసక్తి చూపే విత్తనాల్లో ఒక కంపెనీ ప్యాకెట్ వాస్తవ ధర రూ.853 నిర్ణయించింది. అయితే వ్యాపారులు విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో విత్తన ధరలకు అమాంతం రెక్కలు వచ్చాయి. రూ.853కు విక్రయించాల్సిన ఒక ప్యాకెట్‌ను రూ.2,300నుంచి రూ.2,500వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఒక్కో ప్యాకెట్‌పై రూ.1,400నుంచి రూ.1,500లు ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా వ్యాపారులు అక్రమంగా కోట్ల రూపాయలు దోచుకుంటున్నారనే విషయం తేటతెల్లమవుతోంది. దీనికి తోడు రైతులు కోరుకునే విత్తనాలు కావాలంటే.. అవసరం లేని మరో విత్తన ప్యాకెట్ అన్యాయంగా అంటగడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో అదనంగా రైతులపై మరో రూ.వెయ్యి భారం పడుతోంది. ఇదిలా ఉంటే మరో పక్క మరి కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలతో రైతుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇటీవల వరంగల్‌లో నకిలీ విత్తనాల ముఠాను పోలీసులు పట్టుకోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. విత్తనాలే కాకుండా పురుగు మందులు, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు నకిలీ సరుకులను కొన్ని ఇప్పటికే జిల్లాలో భద్రపరుచుకున్నట్లు తెలుస్తోంది. వీటి విక్రయానికి వ్యాపారులు ప్రత్యేకంగా ఏజెంట్‌లను నియమించుకున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్న జిల్లా వ్యవసాయ శాఖ, విజిలెన్స్‌శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టడంలో విఫలం చెందారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెటింగ్‌పై దృష్టి సారించకపోవడం వారి అలసత్వాన్ని బహిర్గతం చేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు మేలు జరిగేలా చూడాల్సిన బాధ్యతను గుర్తించాలి. ఈ మేరకు వరంగల్ కలెక్టర్ వ్యవసాయశాఖను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ఆధునీకరించిన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నల్లబెల్లి: జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే

నర్సంపేట: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన లభిస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ దేవల్ పాఠశాలలో మనబస్తీ మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఆధునీకకరించిన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. అధునాతన విద్య అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, రాగిజావ అందించారు. డీఈఓ వాసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, కమిషనర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

**భవిష్యత్ తరాలకోసమే.. సౌకర్యాలు**

నల్లబెల్లి: భవిష్యత్ తరాల కోసమే సీఎం కేసీఆర్ మన ఊరు – మన మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా రేలకుంట ప్రాథమిక పాఠశాలలో రూ.26లక్షల నిధులతో చేపట్టిన ఆధునీకరణ పనులను విద్యార్థి గాయత్రితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 104 ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు రాగి జావ అందించి, పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునిత, వైస్ ఎంపీపీ గందె శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్, డీఈ, తహసీల్దార్ రాంరెడ్డి, మంజుల, ఏఈ చందర్, ఎంఈఓ చదువుల సత్యనారాయణ, సర్పంచ్ రత్నాకర్ రావు, ఎంపీటీసీ సుస్మిత, హెచ్ఎం శారద, ఎస్ఎంసీ చైర్మన్ రాజన్న పాల్గొన్నారు.

## విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్ : విద్యారంగానికి ప్రభుత్వ పెద్దపీట వేసిందని వక్తలు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. వరంగల్ డీఈఓ వాసంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నరేందర్, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను వారు తిలకించారు. అదనపు కలెక్టర్ అశ్వినితానాజీవాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీమ్, కార్పొరేటర్ పోశాల పద్మ, ఏఎంఓ సారయ్య, ఎంఈఓ విజయ్, హెచ్ఎం శారదాబాయి, కేడల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు కళాశాలల్లో ఉత్తమ బోధన

- జిల్లా ఇంటర్ విద్య అధికారి మాధవరావు



కొనాయమాకులలో మాట్లాడుతున్న మాధవరావు

గీసుకొండ: ప్రభుత్వ కళాశాలల్లోనే అర్హత, అనుభవం కలిగిన అధ్యాపకులతో ఉత్తమ బోధన ఉంటుందని, ప్రైవేటు కాలేజీల మోజులో పడొద్దని ఇంటర్ విద్య జిల్లా అధికారి(డీఐఈఓ) మాధవరావు అన్నారు. మండలంలోని కొనాయమాకుల వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రిన్సిపాల్‌గా సంగెం కళాశాలకు చెందిన ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, ఉత్తమ అధ్యాపకులుగా వర్ధన్నపేట కళాశాలకు చెందిన పి.జ్యోతిర్మయి, ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా కె.స్వాతిరాణి, ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా వర్ధన్నపేట కళాశాలకు చెందిన ఎస్.రజిత, ఉత్తమ రికార్డు అసిస్టెంట్‌గా ఫోర్ట్ వరంగల్ కళాశాలకు చెందిన ఎండీ ఫాతిమా, ఉత్తమ ఓఎస్‌గా నర్సంపేట కళాశాలకు చెందిన సయ్యద్ జాఫర్‌లను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో గీసుకొండ, వర్ధన్నపేట, నర్సంపేట కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎస్.అశోక్‌రావు, జితేందర్‌రెడ్డి, సువర్ణ, జూనియర్ లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు విద్యాదినోత్సవ ర్యాలీ నిర్వహించారు.

## గడువులోగా పనులు పూర్తి చేయాలి

వరంగల్ అర్బన్: స్మార్ట్‌సిటీ, హరితహారం ప్రాజెక్టు పనులను గడువులోగా పూర్తి చేసి, మరిన్ని అవార్డులు, ప్రశంసా పత్రాలను సాధించాలని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీర్లు, ఉద్యాన విభాగాల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులు అందజేసిన హరిత పురస్కారం, ప్రశంసాపత్రాన్ని మేయర్, కమిషనర్ స్వీకరించి మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రేటర్ వరంగల్‌కు హరిత పురస్కారం దక్కడం సంతోషమని అన్నారు. స్మార్ట్‌సిటీ లక్ష్యాలను త్వరితగతిన చేరుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

### ● విత్తనం మొలకెత్తేనా..?



**మృగశిర కార్తె మొదలైన వెంటనే విత్తనాలు నాటితే పంటదిగుబడి ఎక్కువగా వస్తుందనే నమ్మకంతో పలు గ్రామాల్లో రైతులు విత్తనాలను వేశారు. ప్రధానంగా పత్తి విత్తనాలు వేసి 15 రోజులు కావస్తున్నా.. వాన జాడ లేక పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు వృథాగా పోకుండా కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఇందులో భాగంగా బిక్కాజిపల్లి కి చెందిన రైతు ఇజ్జిగిరి భిక్షపతి తన భార్యా పిల్లలతో కలిసి పత్తి విత్తనాలకు నీరుపెట్టేందు కు డ్రిప్ సిస్టమ్ పైపులను చేనంతా పరుస్తున్న దృశ్యం మంగళవారం 'సాక్షి' కంటపడింది.**

- దుగ్గొండి

## వైద్య పరీక్షలు చేయించుకోవాలి: మేయర్

వరంగల్ అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే శ్రీరామ రక్ష అని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని మేయర్ సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళా ఆరోగ్యం.. ఇంటికి సౌభాగ్యం పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక రోగాలు రాకుండా ముఖ్యంగా మహిళా కార్మికులు ఎప్పటికప్పుడూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ముందస్తుగా గుర్తిస్తేనే ప్రాణాంతక వ్యాధులను ఆదిలోనే నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. వైద్య శిబిరంలో సుమారు 174 మంది సిబ్బందికి వివిధ పరీక్షలు చేశారు. అందులో 59 మంది రక్తనమూనాలను తదుపరి పరీక్షల నిమిత్తం తెలంగాణ డయాగ్నొస్టిక్‌కు పంపిస్తామని డాక్టర్లు తెలిపారు. 74 మందికి గర్భాశయ ముఖద్వారం పరీక్షలు, ఓరల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని, ఇందులో ఐదుగురికి గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు, నలుగురికి బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం కార్మికులకు మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీమ్, ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్‌రషీద్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, పీఓఎస్‌సీడీ ఉమారాణి, ఎస్‌ఓ వాణిశ్రీ, డాక్టర్లు అనూహ్య, వర్ష, వైద్య సిబ్బందితోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కపాలినీ, భగమాలినీ క్రమాల్లో పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారికి కపాలినీ, భగమాలినీ క్రమాల్లో పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, చతుఃస్థానార్చన తదితర పూజలు చేశారు. దశ మహావిద్యల్లోని కాళీక్రమాన్ని అనుసరించి ఉదయం కపాలినీగా, షోడశీ క్రమాన్ని అనుసరించి సాయంత్రం భగమాలినీగా అలంకరించి నవరాత్ర విశేష పూజలు జరిపారు. ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి కట్టా అంజనీదేవి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, అఖిల భారత అర్చక ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కారంపూడి నర్సింహాచార్యులు తదితరులు పూజలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నర్సింహాచార్యులు మాట్లాడుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో ఆధ్యాత్మికోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్.. జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాలతో కలిసి ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు భారత ఎన్నికల కమిషన్ ఈనెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందని, నియోజకవర్గాలకు సంబంధించిన పూర్తి సంపూర్ణ సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రెండో విడత ఓటరు జాబితా రూపకల్పన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు, ప్రస్తుత స్థితిగతులపై నివేదికలు తయారు చేయాలన్నారు. అధికారులు సమష్టిగా కృషి చేసి వరంగల్, హనుమకొండ జిల్లాలలో 100 శాతం ఓటింగ్ జరిగేలా కృషి చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో రెండు జిల్లాల అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, అశ్విని తానాజీ, పరకాల ఆర్డీఓ రాము, ఎన్నికల సూపరింటెండెంట్ జ్యోతి వరలక్ష్మి, తహసీల్దార్లు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కేయూ వీసీ విదేశీ పర్యటన


కేయూ వీసీ రమేశ్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ మంగళవారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. యూకేలోని లామ్‌పీటర్‌లోని యూనివర్సిటీ ఆఫ్‌వేల్స్ ట్రినిటీ సెయింట్ డేవిడ్ విశ్వవిద్యాలయంలో సెమినార్‌లో పాల్గొనబోతున్నారు. ఈనెల 22, 23 తేదీల్లో ఆ యూనివర్సిటీలో జరిగే 'గ్రీన్ ఫ్యూచర్స్, కలర్స్ ,లాంగ్వేజ్ అండ్ హెరిటేజ్' సెమినార్‌లో 'ఇండిజియనియస్ నాలెడ్జ్ కల్చర్ అండ్ గ్రీన్ ఫూచర్స్ ది కోయాస్ ఆఫ్ తెలంగాణ' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేస్తారు.ఈ సెమినార్‌లో పాల్గొనడంతోపాటు ఇరు విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంది. ఈ పర్యటనకు ఆయన తోపాటు కేయూ యూజీసీ కోఆర్డినేటర్ , జియాలజీ విభాగం ఆచార్యుడు మల్లికార్జున్‌రెడ్డి, కేయూ ఇంగ్లిష్ విభాగం అడ్జెంట్ ఆచార్యుడు దామోదర్‌రావు వెళ్లారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

తొర్రూరు : పట్టణ కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం పట్టణంలోని బీరప్ప నగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ డి. వెంకటేశ్వర్లు మంగళవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన రూ. లక్ష, 5 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ జరిపారు. అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగారెడ్డి తెలిపారు.

### 14 మంది హోంగార్డులు బాధ్యతల స్వీకరణ

ఖిలా వరంగల్ : వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాలకు ఎంపికైన 14 మంది హోంగార్డులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఈ జిల్లాల్లో పనిచేస్తున్న 14 మంది హోంగార్డులు బదిలీ అయ్యారు. ఆయా జిల్లాల అధికారులను హోంగార్డులు కలిసి తమ జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్దిఖీ మాట్లాడారు. హోంగార్డులు వాహనదారులతో స్నేహపూర్వకంగా ఉండాలని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు.




## ఆసనం.. ఆరోగ్యం..

నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో యోగా నేర్చుకుంటున్న నగరవాసులు



ఆరోగ్య ప్రదాత యోగా..

- మానసిక ఒత్తిడి నుంచి విముక్తికి చక్కటి మార్గం
- జిల్లాలో పెరుగుతున్న ఆదరణ
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ప్రతీ ఒక్కరిది ఉరుకుల పరుగుల జీవితమే. క్షణకాలం కూడా తీరిక లభించడం లేదు. ఉదయం లేచి మొదలు.. రాత్రి నిద్రించే వరకూ బిజీ షెడ్యూలే. ఫలితంగా మానసిక ఆందోళన, చిరాకు, అశాంతి, ఒత్తిడి, కలవరం, కోపం వంటి అనారోగ్య సమస్యలు పద్మవ్యూహంలా చుట్టుముడుతున్నాయి. వీటి బాగు కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ ఆస్పత్రుల చుట్టు తిరుగుతున్నారు. అయినా ఫలితం లభించకపోవడంతో మరింత మానసికంగా కృంగిపోతున్నారు. ఈ క్లిష్ట తరుణంలో అనారోగ్య సమస్యలను పటాపంచలు చేసి, మానసిక ప్రశాంతతను చేకూర్చే దివ్య ఔషధం యోగా. రకరకాల మందులు తాత్కాలిక ఉపశమనం అందిస్తే , యోగా మాత్రమే దీర్ఘకాలిక ఊరట అందిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం. -వరంగల్ స్పోర్ట్స్

**వేల ఏళ్ల క్రితం భారతావనిలో పురుడు..**

వేల ఏళ్ల క్రితం భారతావనిలో పురుడుపోసుకున్న ఆ మహిమాన్విత సంజీవని యోగా. ధ్యానం గురించి పల్లె నుంచి.. పట్నం వరకు ప్రతి ఒక్కరూ తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆసనాలు వేయడంలో మెళుకువలను నేర్చుకుంటూ జీవితాల్లో ఆరోగ్యకాంతులు విరబూయించుకుంటున్నారు. శాంతియుత జీవనానికి బాటలు వేసుకుంటున్నారు.

**భారత్ ప్రతిపాదనకు ఐరాస సమ్మతం..**

యోగాను విశ్వవ్యాప్తం చేయాలని కోరుతూ 2014లో భారత్.. ఐరాసకు ప్రతిపాదనలు పంపింది. అందుకు సమ్మతం తెలుపుతూ ఐరాస.. 2015 జూన్ 21న ప్రపంచ యోగా డే గుర్తించింది. కాగా, 8 సంవత్సరాలుగా జూన్ 21న ఒక్క రోజు యోగా వేడుకలు చేస్తుండగా, ఈ సంవత్సరం 25 రోజులు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి గత నెల 27న హైదరాబాద్‌లో యోగా వేడుకలను ప్రారంభిచారు. జిల్లాలో కూడా వివిధ శాఖల సమన్వయంతో యోగా వేడుకలు నిర్వహిస్తున్నారు.

**యోగా పట్ల అన్ని వయస్సుల వారిలోనూ ఆసక్తి..**

జిల్లాలో యోగా నేర్చుకోవాలనే ఆసక్తి అన్ని వయస్సుల వారిలోనూ పెంపొందుతుంది. అందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలో ఏర్పాటు చేసిన పలు యోగా సెంటర్లలో శిక్షణ పొందేందుకు రోజూ ఎంతోమంది తరలివస్తున్నారు. కొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు కూడా యోగా శిక్షణ అందిస్తున్నాయి. హనుమకొండలోని హరిత హోటల్, సర్క్యూట్ హౌజ్ రోడ్ లోని రామకృష్ణ మఠం, పతంజలి సంస్థలు ఆయా ప్రాంతాల్లో యోగాలో శిక్షణ అందిస్తున్నారు.

**విద్యాసంస్థల్లో యోగాకు ప్రత్యేక పీరియడ్..**

జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో యోగాకు సంబంధించి ప్రత్యేక పీరియడ్‌ను నిర్వహిస్తుండడం గమనార్హం. దీనికి విద్యార్థుల నుంచి కూడా స్పందన లభిస్తోంది. కొన్ని విద్యా సంస్థలలో ఉదయం, సాయంత్రం వెసులుబాటును బట్టి రోజూ అరగంట విద్యార్థులకు యోగా శిక్షణ అందిస్తున్నారు. తద్వారా చిన్నారులలో క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక పరమైన ఆరోగ్య సమస్యలు దూరమవుతున్నాయని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు.

**యోగాతో లాభాలు..**

- యోగా ద్వారా ఏకాగ్రత శక్తి పెరుగుతుంది. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉన్నవారు తమ విధులపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారు.
- తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు, మానసిక ఆందోళనలతో సతమతమయ్యేవారు యోగా పై దృష్టి సారించడం శ్రేయస్కరమని యోగా నిపుణులు పేర్కొంటున్నారు. యోగా ద్వారా శాంతియుత జీవనం సాధ్యమంటున్నారు.
- యోగాలో ధ్యానానికి సంబంధించిన ఆసనాలు వేయడం వలన శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది. రోజూ ధ్యానం చేస్తే శ్వాస పరమైన ఇబ్బందులు క్రమంగా తొలగిపోతాయని యోగా నిపుణులు తెలుపుతున్నారు.
- నిత్యం యోగా వల్ల విద్యార్థులలో జ్ఞాపక శక్తి పెంపొందుతుంది. తద్వారా చదువులో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.
- యోగాసనాల వల్ల శరీరంలో కీలక రక్తప్రసరణ వ్యవస్థ ఉత్తేజమవుతుందని, ఫలితంగా ఆరోగ్య సమస్యలు దరిచేరవని విశ్లేషకులు చెబుతున్నారు.

**యోగాకు రోజూ గంట కేటాయించండి..**



కేవలం గంట సమయం యోగాకు కేటాయించండి. తద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవు. నిత్య యోగాతో కరోనాను సైతం ఎదుర్కొనే శక్తి వస్తుందని నిరూపించాను. రోజూ గంట సమయం ధ్యానం, ప్రాణయామం, సూర్య నమస్కారం చేస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుంది. కరోనా సమయంలో హరిత హోటల్ వేదికగా 5వేల మందికి శిక్షణ అందించాను. అందరూ కరోనాను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం యోగా వేడుకల సందర్భంగా గత నెల 27 నుంచి ఇప్పటి వరకు పద్మాక్షి , భద్రకాళి, వేయిస్తంభాల గుడి, రామప్ప , ఖిలావరంగల్, ములకనూరులోని ముత్తారం త్రికూటేశ్వరాలయంలో భక్తులకు యోగా తరగతులు నిర్వహించాను.

\- పోశాల శ్రీనివాస్, యోగా గురువు

## నేడు ఆధ్యాత్మిక ఉత్సవాలు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం జరిగే ఆధ్యాత్మిక ఉత్సవాలను విజయవంతం చేయాలని అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 6ఏ, 6బీ, 6సీ దేవాలయాలలో ధూప, దీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకులు , దేవాలయాల ఉద్యోగులు ప్రభుత్వం పేరిట ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భగా ఈ కార్యక్రమాలు చేపట్టాలని గంగు ఉపేంద్రశర్మ అర్చకు ద్యోగులకు పిలుపునిచ్చారు. కాగా, నేడు సాయంత్రం 5గంటలకు వేయిస్తంభాల గుడి ఆవరణలోని 'కుడా' గార్డెన్స్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో శృంగేరీ శివగంగా పీఠాధిపతి పురుషోత్తమ తీర్ధస్వామి పాల్గొంటారని ఉపేంద్రశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ధుద్రేశ్వరీ రుద్రేశ్వరస్వామి వార్లను ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించి పబ్లిక్‌గార్డెన్ వరకు శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

### వడదెబ్బతో వృద్ధురాలి మృతి


మంగ్లీ (ఫైల్)

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ సర్వన్ తండాకు చెందిన బోడ మంగ్లీ(70) వడదెబ్బకు గురై మంగళవారం మృతిచెందింది. వారం రోజులుగా వీస్తున్న వడగాడ్పులు, ఎండతీవ్రతకు తట్టుకోలేక వాంతులు, విరోచనాలై తీవ్ర అస్వస్థకు గురైన మంగ్లీ.. తెల్లవారుజామున మృతిచెందింది.

## నకిలీ పత్తి విత్తన ముఠా అరెస్టు

- 40 కిలోల విత్తనాలు, 23 బుల్లెట్ 5జీ రకం ప్యాకెట్లు స్వాధీనం


నకిలీ పత్తి విత్తన ముఠా అరెస్టును చూపుతున్న పోలీసులు

దేవరుప్పుల : ఆంధ్రా టు తెలంగాణ చైన్‌లింక్ సిస్టంతో కౌలు రైతుల పేరిట నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు, వ్యవసాయ అధికారులు మంగళవారం సంయుక్తంగా పట్టుకున్నా రు. ఇటీవల మండలంలోని కామరెడ్డిగూడెంలో పల్నాడుకు చెందిన రామారావు.. కౌలు రైతుగా చెలామణి అవుతూ నకిలీ పత్తివిత్తనాలు అమ్ముతుండగా వ్యవసాయశాఖ, స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకొని టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించారు. కాగా, టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం రామరావుతో ఇక్కడ పత్తి విత్తనాలకు రైతులు ఆసక్తి చూపుతున్నారని సమాచారం ఇప్పించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యారమంచు హనుమంతరావు, ఐనంపాడి రంజిత్, కోటేశ్వర్‌రావు మండల కేంద్రానికి రావడంతో అధికారులు వారిని అదుపులోకి తీసుకుని 40 కిలోల నకిలీ పత్తివిత్తనాలు, బుల్లెట్ 5జీ రకానికి చెందిన 23 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురిలో కోటేశ్వర్‌రావు పరారయ్యాడు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, ఈ ముఠాను పట్టుకునేందుకు సహకరించిన ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ, రాంబాబు, దేవరుప్పుల ఎస్సై రమేశ్‌నాయక్, ఎస్సైలు పి.దేవేందర్, జి.భరత్ కుమార్, వి.లవన్‌కుమార్, డి.రాజు, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని అభినందించారు.

### అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి


బ్రహ్మచారి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వీఎస్ లక్ష్మీపురం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శ్రీరామోజు బ్రహ్మచారి (30) ఆటో నడుపుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మానుకోటకు వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లాడు. భార్య ఇంటి వెనక పనిచేస్తుడగా అనుమానాస్పద స్థితిలో బ్రహ్మచారి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. భార్య భవాని ఇంట్లోకి వచ్చి చూసే సరికి బ్రహ్మచారి ఉరివేసుకుని కనిపించగా స్థానికుల సాయంతో కిందకు దింపి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు బ్రహ్మచారి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

### రైతుపై ఇసుక మాఫియా దాడి

టేకుమట్ల (రేగొండ) : ఇసుక మాఫియా బరితెగించింది. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతుండగా అడ్డుకున్న రైతుపై దాడికి పాల్పడింది. ఈ ఘటన రేగొండ మండలంలోని నాగుర్లపల్లిలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 15న నాగుర్లపల్లి శివారులోని చలివాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో పొలాల్లోని నీళ్ల పైపులు ధ్వంసమయ్యాయి. దీంతో అదే గ్రామానికి చెందిన అంజి అడ్డుకోగా అతడిపై సుమారు 10మంది దాడి చేశారు. కుటుంబ సభ్యులు వెంటనే అంజిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కాగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

### మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం


సతీశ్ మృతదేహం

ఖిలా వరంగల్ : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కరీమాబాద్ వినాయక కాలనీలో జరిగింది. ఎస్సై సుమన్ కథనం ప్రకారం దొనికెల రాధిక, సతీశ్ (35) కరీమాబాద్ వినాయకనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాది నుంచి దంపతుల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల ఇద్దరు పిల్లలను తీసుకుని భార్య పుట్టింటి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన సతీశ్.. సోమవారం సాయంత్రం తన మృతికి భార్య, అత్త, బావ మరిదే కారణమని సెల్‌ఫోన్‌లో వీడియో తీసి ఆటో యూనియన్ గ్రూపులో పోస్ట్ చేశారు. అనంతరం అదే రోజు రాత్రి తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లోని వ్యక్తి బయటకు రాకపోవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో మృతుడి సోదరుడు ప్రవీణ్ వెళ్లి చూడగా అప్పటికే సతీశ్ మృతి చెంది కనిపించాడు. దీనిపై మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా వారు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

## సర్కారీ స్కూళ్లలో సకల సదుపాయాలు


లక్ష్మక్కపల్లిలో మన ఊరు -మనబడి పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

కొడకండ్ల : తెలంగాణ ప్రభుత్వం సర్కారీ పాఠశాలలను 'ప్రైవేటు'కు దీటుగా తీర్చిదిద్దుతూ సకల సదుపాయాలు కల్పించిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మండలంలోని లక్ష్మక్కపల్లి యూపీఎస్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తికాగా మంగళవారం ప్రారంభించారు. అనంతరం పెద్దబాయితండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను కలెక్టర్ శివలింగయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహోన్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ మనఊరు – మనబడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించి రూపు రేఖలు మార్చారన్నారు. రాగి జావ, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, దుస్తులు అందజేస్తూ నిరుపేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తుందన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, ప్రతిపక్షాల అర్థంలేని విమర్శలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాము, ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ సత్తమ్మ, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, సర్పంచ్, ఎంపీటీసీలు శోభారాణి, సునీత, రాంకోటి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, కృష్ణమూర్తి, పుల్సింగ్, ఉప్పలయ్య, సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మా త్యాగాలకు గుర్తింపులేదా?

- భవిష్యత్తుకు భరోసా ఏది?
- రాజకీయ అవకాశాలు, నామినేటెడ్ పదవులు ఇవ్వాలి
- కేయూ విద్యార్థి ఉద్యమకారుల డిమాండ్


అభివాదం చేస్తున్న నాటి విద్యార్థి ఉద్యమకారులు

కేయూ క్యాంపస్: మలిదశ తెలంగాణ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారుల పాత్ర కీలకమని, రాష్ట్ర ఏర్పాటు అనంతరం తమ త్యాగాలకు గుర్తింపు లేదా..? తమ భవిష్యత్తుకు భరోసా ఇవ్వరా? అని నాటి కేయూ విద్యార్థి ఉద్యమకారులు సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిధిలోని దూర విద్యాకేంద్రం ప్రాంగణంలో వారు విలేకరులతో మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం అయినా తమకు సరైన గుర్తింపు లభించడంలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పొలికేక పాదయాత్రలు, రాయనిగూడెం, మిలియన్ మార్చ్, చలో సాగర హారం, చలో అసెంబ్లీ, తదితర కార్యక్రమాల్లో కేయూ విద్యార్థి ఉద్యమకారుల పాత్ర అద్వితీయమన్నారు. అయితే సీఎం కేసీఆర్‌ను పలుమార్లు కలిసి తమ సమస్యలు వివరిస్తే ఆయన సానుకూలంగా స్పందించినప్పటికీ.. ఉమ్మడి వరంగల్ జిలా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా తమకు రాజకీయ అవకాశాలు, వివిధ నామినేటెడ్ పదవులు కల్పించాలన్నారు.అంతేకాకుండా ఉద్యమకారులకు సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ విధానాన్ని ప్రకటించి వచ్చే ఎన్నికలలోపు అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూ విద్యార్థి ఉద్యమకారులు డాక్టర్ సాదు రాజేశ్, ఫిరోజ్‌పాషా, చిర్రరాజు, మందవీరస్వామి, దేవోజీనాయక్, పి కొమురయ్య, జోరిక రమేశ్, మాచర్ల శరత్‌చంద్ర, ఇ విజయ్‌ఖన్నా, చల్లా శ్రీనివాస్, రాజగోపాల్, కత్తెరపల్లి దామోదర్, దుర్గం సారయ్య, సూత్రపు అనిల్, ప్రభాకర్, రంజిత్, ప్రశాంత్, రాజేందర్, మధుకర్, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్‌నాయక్, వీరస్వామి, సురేశ్, రామ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారెడ్డి.. నిన్ను ఓడిస్తా

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

ఎంజీఎం : 'ధర్మారెడ్డి.. తరిమికొట్టడం నీకేం తెలుసు.. తరిమికొట్టడమంటే కొండా మురళికి తెలుసు.. మా కార్యకర్తలు నిన్ను ఉరికిస్తరు.. మైసమ్మ సాక్షిగా చెబుతున్నా.. పరకాలలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు నిలుచున్నా నిన్ను ఓడిస్తా' ఖబర్దార్ అంటూ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చల్లాపై మండిపడ్డారు. మంత్రి కేటీఆర్‌పై కొండామురళి వ్యాఖ్యలను ఖండిస్తూ చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. దీనిపై స్పందిస్తూ మంగళవారం వరంగల్ రత్నహోటల్‌లో కొండామురళి విలేకరుల సమావేశంలో ప్రతి విమర్శలు చేశారు. 'ధర్మారెడ్డి నువ్వు నా ఇంటికి వచ్చి బతిమిలాడి రూ. 14 కోట్ల విలువైన ప్రగతి సింగారం బ్రిడ్జి పనులు తీసుకోలేదా' అని గుర్తు చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో చలివాగు ప్రాజెక్టు, శాయంపేట మండల కేంద్రంలో 14 ఎకరాల్లో మోడల్ కాలేజీ, ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌కు స్థలం ఈ పనులన్నీ తానే చేశానని, ఎమ్మెల్యే చేసింది ఏమిటని ప్రశ్నించారు. అక్రమాలను వెలికితీసే జర్నలిస్టులకే ఈ ప్రభుత్వంలో రక్షణ కరువైతే.. సామాన్యుల పరిస్థితి ఏమిటో అర్థమవుతుందన్నారు. మహిళలను అవమానించి కేసులు నమోదు చేయించే సంస్కృతి ధర్మారెడ్డి అయితే.. వారికి అండగా నిలిచే సంస్కృతి తనదన్నారు. 'పరకాల ప్రజలకు నీ గురించి గొప్పగా తెలుసు.. నువ్వో మట్టి దొంగవు' అని ఎద్దేవా చేశారు. మట్టి తీయడం, మొరం తీసి అమ్మడం, కాంట్రాక్టు పనుల్లో పర్సంటేజీ నొక్కడం ఇది ఎమ్మెల్యే సంస్కృతి అని మండిపడ్డారు. తూర్పులో కొండా సురేఖను, పరకాలలో కాంగ్రెస్ అభ్యర్థి తానే గెలిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తూర్పు, పరకాల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గించాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ : ట్రాన్స్‌ఫార్మర్‌ల వైఫల్యాలు తగ్గించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని కార్యాలయం నుంచి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల ఎస్‌ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల్లో ఆలస్యం జరుగకుండా చూడాలన్నారు. దోభీఘాట్, నాయి బ్రాహ్మణ, లాండ్రీ షాపుల సర్వీసులు సకాలంలో మంజూరు చేయాలన్నారు. కాలిన, ఆగిపోయిన మీటర్లను వెంటనే మార్చాలన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వర్క్ ఆర్డర్లు పూర్తి చేయాలన్నారు. బిల్లులు సకాలంలో అందించి రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయాలన్నారు. ఓవర్ లోడ్ ఫీడర్లు, డీటీఆర్‌లను గుర్తించి వాటిపై భారం పడకుండా లోడ్ బదలాయింపు చేపట్టాలన్నారు. సమీక్షలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వర రావు, డైరెక్టర్ పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## ఉత్సవ విగ్రహాల్లా ఎంపీటీసీలు..

- నయాపైసా కేటాయించని ప్రభుత్వం
- నిధులు, విధులు లేక కూలీకి వెళ్తున్న ప్రజాప్రతినిధి


ఉపాధి హామీ పనులు చేస్తున్న ఎంపీటీసీ బద్రి, భర్త చంద్రు

మహబూబాబాద్ రూరల్ : ధనిక రాష్ట్రం తెలంగాణలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన పలువురు ఎంపీటీసీలు నిధులు, విధులు లేక ఉత్సవ విగ్రహాల్లా నిలుస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీటీసీలకు ప్రభుత్వం నయాపైసా ఇవ్వడం లేదు. దీంతో పదవి తప్ప ఎలాంటి నిధులు, విధులు లేకపోవడంతో చేసేదేమీలేక కొందరు పూటగడవని పరిస్థితిలో కూలీకి వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామ ఎంపీటీసీ బాదావత్ బద్రి.. ఉమ్మడి మల్యాల గ్రామ పరిధిలోని మల్యాల, రేగడి తండా, సాదు తండా, చోక్ల తండా, దామ్య తండా ( ఐదు ) గ్రామ పంచాయతీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే తనకు ఎలాంటి నిధులు, విధులు లేకపోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో తాను, తన భర్త చంద్రు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వం ఎంపీటీసీలను పట్టించుకోవటం లేదని, కేవలం పదవి ఉన్న కారణంగా తమకు ఏదో సహకారం అందిస్తున్నట్లు ప్రకటించడం తప్ప లబ్ధి చేకూరింది ఏమి లేదని వాపోయారు. ఇప్పటికైనా గ్రామాల అభివృద్ధికి తమకు నిధులు కేటాయించాలని కోరారు.